# కుంటికర్ణం

ఆ మద్దె ఒకనాడు తెల్లార తాళకే అరుణాచలం అయ్యోరు మాయింటి కాడికొచ్చె!

అరుణాచలం అంటే నిజంగా అరుణాచలమంత మణిసి. ఇట్టా మాదిర పేరు అందురికీ పొసిగేదంటే మాట్లుకాదు. అది ఏ నూటికో కోటికో ఏ కొందురికో పొసిగతింది. పొసిగినా పొసక్కుండా పాయ్‌నా కోతి మాదిర ఉండే పిల్లదానికి జోతి అని పేరు మాత్రం పెట్టేస్తారు కానీ ఈ దేశింలో పొంతనాలు కుదిర్తే తప్ప పెండ్లిండ్లు మాత్రం జరగవు!

అరుణాచలం పుట్టింది కార్వేటి నగరాన. చదువుకుణ్ణింది తిరపతిలో. మల్లా మొనగాడు పాయ్ చదువు చెప్పింది నీళ్ల కవతల. అయినా ఎగ్గీ పెగ్గీ రొండూలేని మణిసి. లేకుండాబోతే నా కొంపకు యాడొస్తాళ్లే?

అరుణాచలం యింటి కాడికి వచ్చేకుందికి యింకా నేను నిద్దర పడకమిందనే ఉండా. పొద్దు పుట్టేదాకా నిద్దరబోతే యాడలేని దరిద్రం కొంపలోనే ఉంటిందిరా! అని మాఅయ్య చెప్తానే ఉండె. అయ్యలో అమ్మలో చెప్పేమాట యిని పించు కుండేటట్టుగా ఉంటే ఈ బతుకు యిట్టా ఎత్తుబారం మొత్తుకోళ్లుగా ఎందుకేడిస్తింది లే ? దరిద్రం నెత్తికెక్కి దొబ్బుతావుంటే నేను పొద్దుపుట్టే దాకా నిద్దర పడక మిందుండా. ఆ యాళకే నీళ్ల కవతలికి పాయ్యొచ్చిన మణిసి నీటుగా తయారై వచ్చేసినాడు. తనచేత తన రాతని యాణ్ణే తెలిసిపోతా ఉండ్లా?

అరుణాచలం స్కూట్రు యింటి ముందర నిలబెట్టా ఉండంగానే పిలకాయిలు మిద్దిమిందికి పరిగెత్తుకోనొచ్చి అరుణాచలం వచ్చిన సంగతి చెవల్లో ఊదిరి. ఆదరాబదరా పైకి లేచినా. ఊడిపోతావుండే పంచను మొలకు చుట్టుకుంటా వచ్చేకుందికి అరుణాచలం పైకొచ్చి కూసోని ఉండాడు.

పాచి పొండ్లతో పక్కన కూసోలేక ఒక్క నిమిశం. వచ్చేస్తానబ్బా! అంటా గబ గబ కిందికి పాయ్‌నా. రోన్ని నీళ్లెత్తి నోట్లో పోసుకోని పుక్కిళించి ఊసేసినా. దోసిడు నీళ్లతో మొకం అట్టా తుడ్సుకుణ్ణె సాంగిం చేసినా. పైకొచ్చి అరుణాచలం పక్కన కూసోని-

''ఊ! చెప్పుబ్బా!'' అంటి.

''చెప్పుబ్బా! అనేమాట యిని ఎన్నాళ్లయి పాయబ్బా? మనం చదువుకుంటా ఉణ్ణెప్పుడు ఏమబ్బా? ఏమన్నా? ఏమియో? అని పిల్సుకుంటా ఉంటిమే? ఇప్పుడు తిరపతికి ఏమండీ? దిగుమతి అయిపొయింది. ఎవుడి నోట్లో యిందామన్నా యిదేమాట. మన మాట్లు మరగన పడి పోతా వుండాయి గదబ్బా!'' అనె.

''మాట్లే మరగన పడిపోతే పీడాగిటి పాయ. బతుకులే మరగన పడిపోతా ఉండాయి. మన ముక్కెమంత్రి అన్న మాత్రం రాయలసీమను రత్నాలసీమను చేస్తానంటా ఉండాడు. ఈమాట మనం పుట్టి బుద్దెరిగిన నాట్నుంచి యింటానే ఉండాం గదా? అంగిట్లో అన్నీ ఉణ్ణా అల్లుడి నోట్లో శని మాదిర మన బతుకులు! అదట్టా పోనీ గానీ వచ్చిన పని చెప్పు?''- అని అడిగే కుందికి వచ్చిన పని మర్సిపాయ్‌నట్టు ఒక మాదిరిగా మొకం పెట్టె అతగాడు.

''యో! నువ్వు కర్నం గదా? లెక్కాచారంగా ఆలోచిస్తా ఉంటావులే. మన ముక్కెమంత్రి యాణ్ణో శంకుస్తాపన చేస్తా ఎండి కరిణె గూడా యిడ్సిపెట్లేదే? దాని బతుకంతా ఎంత చేసు? ఇట్టాంటి మొకమా మాలు గట్టేది? యిట్టాంటి మొకమా తేని తీసేది? అన్నెట్టుగా యిటుమంటోళ్లంతా ఈ రాళ్లసీమను రత్నాలసీమగా మారిస్తే యింకేం ఉండాది? మా కార్వేటినగరం రాజులు దండిగా దానదర్మాలు చేసిరి. మిద్దిల్నుమేడల్ను గెవర్నమెంటుకు యిచ్చేసి యిస్కూలు పెట్టమని. అటుమంటి మహన్నబావు లెందరో మట్టిలో కల్సిపోతే దొరికిన కాడికే చాలనుకునే యీళ్లా ఈ సీమను రత్నాల సీమగా మార్చేది. ఒకేళ మార్సినా ఆ రత్నాల్ను మనకేడ దక్కనిస్తార్లే? అని ఆలోచిస్తా ఉండావ్ కదా?'' అని అడిగేకుందికి అరుణాచలం పక పక నవ్వేసె.

''నవ్వు నాలుగిదాలుగా సెబ్బరన్నారు. ఎందుకు నవ్వతావుకానీ- వొచ్చిన పని చెప్పరాదా?'' అంటే దొంగలు పాయ్‌న ఆరు నెల్లకు కుక్కలు మొరగినట్టుగా ఎప్పుడో చచ్చిపాయ్‌న మాయమ్మ కత ఎత్తుకుండె.

''ఎవురో చెప్తే ఇంటి. పెద్ద చావు గదా? నూరేండ్లకు పైబడి బతికేదంటే మాట్లా? అందుకే పలకరించి పోదామని వొస్తిని.'' అనె.

''ఏముండాది లేబ్బా? ఆమెకేమి? ఆమె వరకు బతికినంత బతుకు బతికె. చెయ్యాల్సిందంతా చేసె. చూడాల్సిందంతా చూసె. మనం ఆమాత్రం బతక పోతామా? ఆమెను గురించి బాద పడాల్సిన పని ఏముండాది లే?'' అంటే-

''అది గూడా నిజమే అనుకో. పాయ్‌నోళ్లంతా పుణ్ణాత్ములనుకుందాం. పోనీ నువ్వు

నాలుగ్గాళ్లమండపం రాస్తా ఉండావు గదా? రాయలసీమలో కర్ణమొల్ల గురించి ఎందుకు రాయలేదే'' అనె.

''ఊరి మింద ఊరు పణ్ణా కర్ణం మింద కాసు పడదంటార్లు. ఎవుడికి కడుపు రగిలిందో? ఎందుకు రగిలిందో? ఏ కర్ణం ఏం చేసినాడో? ఈ మాట వాడెవుడో అనేసి పొయ్యుంటాడు. ఇప్పుడు నేనా మాటంటే గుమ్మిడి కాయల దొంగంటే బుజాలు తడుముకుణ్ణెట్లు మీ కర్ణాలంతా నా మింద కారాలు మిరాలు నూర్తే నేనేం చెయ్యాల మల్లా?''

''నువ్వు చెప్పేది బలే బాగుండాదే? మహన్నబావుడు బుడ్డా వెంగళ రెడ్డిని కలియుగ దానకర్ణుడు అన్నెట్టుగానే పల్లిపుట్టు కొండారెడ్డిని పాపం చేసిన ముండా రెడ్డి అంటారు గదా? మోడెత్తే వాళ్లా దొమ్మరాటలాడే వాళ్లా గుడ్డ పేలికల్తో కొండారెడ్డి బొమ్మను చేసి ఈదిలో యిసిరేసి నలగరి ముందర నానా తిట్లు తిట్తారు. నువ్వు యిన్లేదా?'' అని అడిగె.

''ఎందుకిన్లా? యిన్నానబ్బా?'' అంటే-

''బుడ్డా వెంగళరెడ్డి మింద రాసినట్టుగానే పల్లిపుట్టు కొండారెడ్డి మింద రాయాల. ఈళ్లేగాదు పేరూరు రామదాసు... పాడిపేట గోవిందదాస్... ఈళ్లందుర్నీ గురించి రాయాలబ్బా. పోనీ! ఆరూరి కర్ణం కత తెల్సునా?'' అని అడిగె.

రాసిందాని కంటే రాయాల్సిందే శానా ఉండాది గదబ్బా? మా ఊరి కుంటి కర్ణం కత నాకు తెల్సు. ఆరూరు కర్ణం కత నాకు తెల్దే?'' అంటే-

''ఒరే! పిచ్చోడా! యింతేనా నువ్వు?'' అన్నెట్టుగా నవ్వి-

''ఆరూరి కర్ణం బతికి ఏడిపించె. చచ్చిగూడా ఏడిపించె. అంటారు. బతికినప్పుడు ఎవురెవుర్ని ఎట్టెట్టా ఏడిపించినాడో మనకెందుకు గానీ మొనగోడు చచ్చిగూడా ఏడిపించినాడంటే ఏమనుకోవాల? మాదగ్గిర నువ్వు శానా జాగర్తగా ఉండాలయ్యో! ఏమనుకుణ్ణావో? ఏమో?'' అనె నవ్వతా.

''పుట్లో మూడాకులెయ్యని పుడింగులు శానా మంది తాటాకు మంట మాదిర్తో లేస్తా ఉండారు. కానీ నువ్వు కానీయా! ఆరూరు కర్ణం కత చెప్పు.'' అంటి.

''ఆరూరి కర్ణానికి ఏమబ్బా? ఆరు నూరు గానీ అగ్గురారం కొల్లపోనీ బతికినంత కాలం ఎదుర్లేకుండా బతికినాడంట. మాకర్ణాల కత నీకు తెల్సు గదా? ఆ పూటకు జరిగితే చాలు. రేపటి కత రేపు అనే బాపతు. ఆరూరి కర్ణం సంపాయించినంత సంపాయించి నాడంట. సెలవు గూడా అట్నే చేసినాడంట. అయ్య వొగిటే సారిగా ఎలబారి పొయ్యే కాలం వొచ్చేసింది. కొడుకులు చుట్టూరా కూసోని 'మమ్మల యెట్టా బతకమంటావయ్యో' అని కుయ్యో మొర్రో మని మొత్తుకుణ్ణారంట. అప్పుడా మొగలాయి-

''ఒరే బిడ్డల్లారా? ఏడ్సి ఏమి సాదిస్తార్రా? యాడవ బాకండి. మీరు ఏడ్సినా ఏడవకుండా పాయ్‌నా నేను మాత్రం చచ్చేది కాయం. నేను చస్తానే చచ్చిన సంగతి బయట పెట్టబాకండి. నా తల పగల గొట్టండి. ఆ మడి కయ్యల్లో యాణ్ణో ఒకచోట రొంత లోతు

గుంత లోడి పూడ్సి పెట్టండి. ఆ మిందట మా అయ్యను ఎవురో చంపేసినారో? అని ఆలగోడు బాలగోడు చెయ్యండి. మీరు ఏ లోటు లేకుండా బతికి పోతా(రా!'' అని చెప్పినాడంట.

అబ్బ చెప్పినట్లుగానే కొడుకులు చేసినారంట!

చేసేసి కాకి సోకంగా యిలపిస్తా ఉంటే అదిపాయ్ కాకిగుడ్డల చెవల్లో పడిందంట. ఇంకేముండాది? లడ్డు... కొండలడ్డు చేతికి దొరికినట్టే గదా? అదొక ఎ(రి కాలం. ఊళ్లో వాళ్లందుర్నీ నడవండి స్టేషన్‌కు! అన్నారంట.

అప్పుడు ఊళ్లో వాళ్లంతా చేరి తిలా పాపం తలా పిడికెడు అనుకోని ఇంటికి యింతని పంపకం యేసుకోని వాళ్ల కంత ఈళ్ల కింత యిచ్చి చేతులు యిదిలించు కున్నారంట. అప్పటి నుంచే ఆరూరు కర్నం బతికి సాదించె. చచ్చి సాదించె. అంటారు. ఆరూరి కర్నం కత యిన్నావు గదా? మేము గూడా ఆ తాన్లో పంచలే! వాడెవుడైనా సరే. మాతో మా(తం శానా జాగర్తగా ఉండాల. లేకుండా బోతే చచ్చిఅయినా సాదిస్తాం!'' అనె.

'' ఈ కర్నం వాళ్లంతా యిట్టా మాదిరి బెదిరించే బతికి పొయ్యేటట్లుగా ఉండాదే. అట్ట సాదిస్తా. యిట్ట సాదిస్తా. అనే వాడెవుడూ సాదించింది లేదు గానీ ఈ అంజేరికనం కుంటోడి కతలు ఆడికి కట్టి పెట్టు. ఇంక లెయ్ పోదాం.'' అంటి.

''అవునయ్యో! అంజేరికనంలో కుంటోడి కత ఇంకా రాయలేదా?'' అని అడిగె.

అంతలేకే మా బాశాలి పాలాడంత కప్పుల్లో కాపీ తెచ్చె. అంజేరికనంలో కుంటోడి కత ఆ కాపీ అడగన పాయ్ పడిపాయ. ఆ కాపీ అట్టా గొంతులో పోసుకోని నేను గూడా అరుణాచలంతో ఎలబార్తి సాగనంపేసి వద్దామని!

నాలుగ్గాళ్లమండపం దాకా ఆ మాట ఈమాట మాట్లాడుకుంటా ఇద్దురు నడ్సి పోతిమి. ఆడికి పాయ్‌నాక ఆయన స్కూటరెక్కె. నేను నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడే కుందికి నా మణుసు మా ఊరి కుంటి కర్నం మిందికి పాయ!

మా ఊరి కర్నం పేరు రుద్ర పిళ్ల. అయితే ఆయన్ను అందురు 'కుంటి కర్నం! కుంటి కర్నం!' అంటారు.

నిజిమే! ఆయనకు రొండు కాళ్లు కుంటి. రొండు చేతులు కుంటి. దానికి తోడు నత్తి. అయితే మా(తం మొనగోడు ఆ పాయికట్నంతా ఏల్నే!

ఏ ఊళ్లో మద్దిస్తం చెయ్యాలన్నా కుంటి కర్నం రావాల్సిందే. ఆ పాయికట్లో బారతం జరిపించాలన్నా కుంటి కర్నం ముందుండాల్సిందే!

పొలమూ పు(రా అమ్మా లన్నా కర్నమే! కొనాలన్నా కుంటి కర్నం ఉండాల్సిందే! అన్నదమ్ముళ్ల బాగ పిరిష్కారానికైనా సరే! ఆలూ మొగుడూ కొట్లాడుకున్నా కుంటి కర్నం మద్దిస్తం చెయ్యాల్సిందే!

మల్లా మణిసి ఎంతుండాడని? ఈడ్సి కొలిస్తే నాలుగడుగులకు నాలుగడ్డేళ్లు తక్కువగానే ఉంటాడు.

నడవలేడు. కూసోలేడు. తనకు తానుగా అంత తినలేడు.

అయినా మొనగోడు ఆపాయికట్నంతా అర్సేతిలో పెట్టుకోని నడిపిస్తా ఉండె!

కుంటి కర్నం ఉణ్ణింది నచ్చుకూర్లో. నచ్చుకూరు మిద్దూరికి రొండు మైళ్ల దూరాన ఉండాది. ఆ పాయికట్టుకంతా మిద్దూరు సెంటర్ గదా? కుంటి కర్నం నచ్చుకూరు నుంచి మిద్దూరికి రావాలంటే బండి కట్టాల. బండి ముక్కిని పైకి లేపేస్తే పారపట్టీలు నేలను తాకతాయి. అప్పుడు కుంటి కర్నాన్ని బండి కొనాన కూసోబెడ్తారు. పైకి లేపిన ముక్కిన్ని కిందికి దించతారు. దిగేటప్పుడు గూడా అంతే. ముక్కిని పైకి లేపితే పారపట్టీలు నేలకు తాకతా ఉణ్ణెప్పుడు దించుకుంటారు. ఆమిందట ఎత్తు తిన్నె మిందనో మంచం మిందనో అలాగ్గా సేతల మింది కెత్తుకోని పాయ్ కూసో బెట్తారు.

ఎప్పుడూ వక్కాకు నమల్తా ఉంటాడు. చెయ్యి వొంగదు గదా? బొట్నేల్తో అట్లా తడితే చాలు. వక్క కరెట్టుగా పాయ్ నోట్లో పడ్తింది. ఇంక రాతంటావా? గొలుసు రాత. పేనా పెడితే దానికి తిరుగు మరుగు ఉండేది లే. బిటీషోడి కాలాన్నుంచి ఎంత మంది కలెక్టర్లు తాసీదార్లను చూసినాడో? ఒక్క మాట పడి ఎరగడే మొనగోడు!

ఆడ నిలబడుకోని కుంటి కర్నాన్ని గురించి ఆలోచించుకుంటా ఉంటే ముత్తారెడ్డన్న వచ్చె.

''ఏమిరా అబ్బోడా? శానా ఆలోచన మిందుండావే?'' అని అడిగె.

''అన్నా! ఊరి మింద ఊరు పణ్ణా కర్నం మింద కాసు పడదు గదన్నా?'' అంటే-

''ఒరే పిచ్చోడా! కర్నాలు ఎంత చేసినా ఏమి చేసినా కూటి కోసరమే గానీ కోట్లు సంపాయించలేదురా. సంపాయించినట్లు దాకలాలు కూడా లేవు. నొప్పించక తానొవ్వక తప్పించుకుండే సాబావం. అందువల్ల ఆ మాటొచ్చింది. అదే మన నాయకులుండారు గదా? కోట్లకు కోట్లు అప్పు తెస్తా వుండారు. లచ్చలకు లచ్చలు సెలవ చేస్తా ఉండారు. ఎలీక్ప్టర్లల్లో తిరగతా ఉండారు. బోయింగ్ యిమానాల్లో తిరగతా ఉండారు. రాజబోగాలు అనబవిస్తా ఉండారు. వాళ్లమింద ఒక కాసు పడ్తావుండాదా రా?'' అంటా నిలదీసె.

దేశం మింద దేశం పడినా మన నాయకుల మింద లవలేసం పడదు! అని ఈ కర్నాల సామెతను మారిస్తే బాగుణ్ణనుకుంటి. అయినా ఎవురు ఆలోచిస్తారు. ఆలోచిస్తే గదా మార్చేదానికి! ●